# వైద్యో నారాయణో హరిః

-డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

బెంగుళూరు మెజిస్టిక్ సర్కిల్ ఎప్పటిలాగే జన సమూహంతో కిటకిటలాడిపోతోంది.

బస్ స్టేషన్, రైల్వేస్టేషన్ ఒకదానికెదురుగా మరొకటి ఉండడంతో బెంగుళూరు మహానగర ప్రజలే కాకుండా వచ్చిపోయే వారి రద్దీ కూడా తోడై మరికాస్త గుంపులుగా కనిపిస్తారు జనం అక్కడ.

టాక్సీ దిగి బస్‌స్టేషన్‌లోకి వచ్చిన సీతారామారావు కర్ణాటక బస్సులు ఆగే వైపుగా కాకుండా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణాకు చెందిన బస్సులు ఆగే చోటికి వచ్చి నిలబడ్డాడు.

ఆయన ఎక్కవలసిన బెంగుళూరు-కర్నూలు సూపర్‌డీలక్స్ బస్సు పదిగంటలకు బయలుదేరుతుంది బెంగుళూరులో. ఉదయం ఆరింటికల్లా కర్నూలు చేరుతుంది. ఎందుకన్నా మంచిదని కాస్త ముందుగానే బస్టాండుకు చేరుకున్నాడాయన.

ఆయన ప్యాంట్ జేబులో నుండి పర్స్ తీసి అందులోని రిజర్వేషన్ టిక్కెట్ తీసుకుని బస్సు నెంబర్ చూస్తుండగా పక్కనుండి ఒక కోమల కంఠం "ఎన్రీ స్వల్ప హెల్ప్ మాడ్తిరా? ఒందైదు నిముష నమ్మ స్యూట్కేసు దోడ్కొంతీరా..." అంటూ పలకరించింది.

పక్కకు తిరిగి చూసాడు సీతారామారావు. ముప్పై అయిదు సంవత్సరాల వయసున్న గృహిణి ఒకామె అయిదేళ్ల కొడుకు పాప్‌కార్న్ వైపు చూపిస్తూ ఆమె కొంగుపట్టి లాగుతుంటే తన సూట్‌కేసు ఆయన పక్కనే పెట్టి చిన్నగా నవ్వి ముందుకు నడిచింది.

ఆ పిల్లవాడిని చూస్తుంటే తన కొడుకు కార్తీక్ గుర్తుకు వచ్చాడాయనకు. ఇద్దరు ఆడపిల్లల తరువాత పదేళ్లు గడిచాక పుట్టాడు వాడు. వాడిని చూసి అప్పుడే మూడురోజులైంది. రేపు కార్తీక్ పుట్టినరోజు. వాడికోసం కొన్న గిటార్ ప్రత్యేకంగా ప్యాక్ చేయించాడు. ఈసారి పుట్టిన రోజుకు గిటార్ కొనివ్వకపోయినా, నానమ్మను తీసుకురాకపోయినా ఆ రోజు అన్నం తిననని ఖరాఖండిగా చెప్పేసాడు. కొడుకు గురించి ఆలోచిస్తుంటే సీతారామరావు ముఖంలో ఆనందం దాచుకోలేనట్టు చిరునవ్వు తొంగి చూసింది.

అంతలో ఆయన ఎక్కవలసిన బస్ రావడం, పిల్లవాడికి పాప్‌కార్న్ కొనడానికి వెళ్లిన గృహిణి కొడుకుతోసహా రావడం ఒకేసారి జరిగాయి. ముందు వాళ్లిద్దరూ బస్ ఎక్కాక వెనకాల తను ఎక్కాడు.

తన సీటు నెంబర్ చూసుకుని తన రాక్‌లో తన సూట్‌కేసు పెట్టి కూర్చోబోయాడు.

ఆయన సీటు వెనుక సీట్‌లో కూర్చోవాల్సిన ఒక పెద్దాయన తన సూట్‌కేసు పైన పెట్టాలని ప్రయత్నిస్తూ బరువు పైకెత్తలేక అవస్థ పడుతుండడం చూసాడు.

"ఆ పెట్టె ఇలా ఇవ్వండి. నేను పైన పెడతాను" అంటూ అందుకుని సునాయాసంగా పైన పెట్టాడు.

"థాంక్సండీ. తెలుగువాళ్లేనన్నమాట" అన్నాడాయన చిరునవ్వుతో.

"ఎపిఎస్ ఆర్టీసీ బస్సులో ఎక్కేవారు ఎక్కువ భాగం తెలుగువారేకదా" అని నవ్వేసి తన సీట్లో కూర్చున్నాడు సీతారామారావు.

అతని ముందు సీట్లో కూర్చున్న ఇరవై ఏళ్ల అమ్మాయి కిటికీకి ఉన్న అద్దం జరపడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. కోమలంగా ఉన్న ఆ పిల్లకు చెయ్యి నొప్పి పుట్టింది కాబోలు 'అబ్బా' అనుకుంటూ ఒక చేత్తో మరో చేయి వత్తుకుంటోంది.

సీతారామారావు ముందుకు వంగి ఆ కిటికీకి ఉన్న అద్దం పక్కకు జరిపాడు.

అయాచిత సహాయానికి కృతజ్ఞత తెలుపుతూ "థాంక్స్" అంది ఆ అమ్మాయి వయొలిన్ పలికినట్లు.

బస్సు కదిలింది. బెంగుళూరు పొలిమేరలు దాటడానికే గంటపైన పట్టింది. బస్సులోపల లైట్లు ఆర్పేయగానే వీడియో కేసెట్ పెట్టేసాడు కండక్టర్. ఇంటికి చేరేసరికి తలనొప్పి తప్పదు అనుకుంటూ కళ్లు మూసుకోబోతున్న వాడల్లా 'గోదావరి' అని సినిమా పేరు చూసి తేలికగా నిట్టూర్చాడు. 'శ్రావ్యమైన పాటలున్న సినిమా వేసాడు' అనుకున్నాడు.

బస్ చిక్‌బెళాపూర్‌లో కొద్దిసేపు ఆగి మళ్లీ బయలుదేరాక అతనికి నిద్ర పట్టేసింది.

మళ్లీ పెనుగొండలో లైట్లు వెలిగితే కళ్లు తెరిచి చూసి మళ్లీ నిద్రపోయాడు.

బస్ అనంతపురం చేరేసరికి ఒకటిన్నర కావస్తోంది.

అనంతపురంలో దిగేవాళ్లు హడావుడిగా తలుపు దగ్గరకు నడుస్తుంటే ఆయన కిటికీలో నుండి బయటకు చూస్తున్నాడు.

అందరూ దిగిపోగానే ఆయనా లేచి తలుపు దగ్గరకు వచ్చాడు. అప్పుడే లోపలకు ఎక్కుతోంది అరవై సంవత్సరాల ముసలావిడ.

"జాగ్రత్త... మెల్లగా ఎక్కు" అంటున్నాడు కింద వున్న అబ్బాయి.

ఆవిడకు చేయి అందించి లోపలకు తీసుకు వచ్చాడు సీతారామారావు.

ఆవిడ నెమ్మదిగా సీటు నెంబర్లు చూసుకుంటూ వచ్చి ఆయన కూర్చున్న సీటు దగ్గర ఆగింది.

"నేను కిటికీ పక్కన కూర్చుంటాను. నాకు గాలి కావాలి" అన్నదావిడ.

అతను తన బ్రీఫ్‌కేసు పక్కకు జరిపి ఆవిడకు చోటు చూపించాడు. ఆవిడ కూర్చున్నాక పక్కనే తనూ కూర్చున్నాడు. కిటికీకి వున్న అద్దం పక్కకు జరిపాడు.


అంతలోనే బస్సు కదలడం, లైట్లు ఆరిపోవడం జరిగింది. సినిమా అయిపోయింది కనుక బస్‌లో అందరూ నిద్రలోకి జారుకుంటున్నారు. ముసలావిడ వెనక్కి జారగిలబడి కళ్లు మూసుకుంది.

ఆవిడ చేతుల్లోంచి జారి కాళ్ల దగ్గర పడిన శాలువాను తీసి జాగ్రత్తగా ఆవిడకు కప్పాడాయన. తనూ వెనక్కు వాలి నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

బస్ డోన్ దాటి అరగంటపైన ప్రయాణం చేసాక జరిగిందా సంఘటన.

ఎదురుగా రోడ్డుమీద పడివున్న కొమ్మను ఆఖరి క్షణంలో చూసి తప్పించుకోబోయి బస్‌ని పక్కకు కోసాడు డ్రైవరు.

అదే క్షణంలో ఈ బస్‌ను దాటిపోవాలని వస్తున్న లారీ వెనుక నుండి వేగంగా వచ్చి బస్‌ను కొట్టింది. బస్సు అదుపు తప్పి ముందుకు దూకి పక్కకు దొర్లింది. ఒక్కసారిగా బస్‌లో హాహాకారాలు చెలరేగాయి, లైట్లు వెలిగాయి. వెనుక కూర్చున్నవాళ్లంతా ముందుకు పడ్డారు. కొంత మంది చేతులు కిటికీల్లో ఇరుక్కుపోయాయి. సీతారామారావు తల ముందు సీటుకు కొట్టుకుని మొద్దుబారింది. కాస్త తేరుకోగానే ముందు తన పక్కనున్న ముసలావిడ వైపు చూసాడు.




ఆవిడ తల కిటికీ బయటకు వేలాడుతోంది. నెమ్మదిగా ఆమెను కూర్చో బెట్టబోతే తల పక్కకు వాలిపోయింది. అప్పుడు గమనించాడు ఆవిడ కణత నుండి కారుతున్న రక్తాన్ని. జేబులో నుండి రుమాలు తీసి గాయానికి అది మిపెడుతూ ఆవిడ ముక్కు దగ్గర వేలు పెట్టిచూసాడు. అతని ముఖం పాలి పోయింది. నమ్మలేనట్లుగా ఆవిడ మణికట్టు దగ్గర పట్టుకుని నాడికోసం చూసాడు. అతని కళ్లల్లోనుండి నీరు కారిపోతోంది. శాలువాను ఆమెమీద కప్పి పక్కకు తిరిగి ఇతరుల పరిస్థితిని గమనించాడు.

తన సూట్‌కేసు చూస్తుండమని అడిగిన గృహిణి గట్టిగా ఏడుస్తోంది. ఆమె అయిదేళ్ల కొడుకు నోటిలోనుండి రక్తం కారుతోంది. వెనుక సీటులో వున్న పెద్దాయన కాలు మెలి తిరిగింది. ఫ్రాక్చర్ అయిందో ఏమో అంత లోనే వాచిపోయింది. ఆయన మెడ కోసిన మేకలా అరుస్తున్నాడు. బయట జనం మూలుగుతున్నారు. ఎవరెవరో అరుపులు, కేకలు, ఆర్తనాదాలు.



## అసత్య ప్రచారం!

ఇటీవల రంభ ఆత్మహత్యా ప్రయత్నం చేసిందనే వార్తలు గుప్పుమన డంతో వాటి గురించి వెంటనే స్పందించింది రంభ. ఇవి కావాలని ఇద్దరు తారలు చేస్తున్న ప్రచారంగానే తను భావిస్తున్నట్టు చెబుతుంది రంభ. ఒకరు తమిళ టీవీ తార అయితే మరొకరు భోజ్‌పురి సినీరంగంలో తనకి పోటీగా వచ్చిన తార అంటోంది రంభ. భోజ్‌పురిలో రంభకి పోటీగా వచ్చిన నగ్మాయే అని అందరికీ తెలుసు. అలాగే భోజ్‌పురి హీరో రవికిషన్‌తో తనకి అఫైర్ అంటగట్టడం వల్లనే తను ఆ రంగానికి గుడ్‌బై చెప్పేసినట్టు, తనకి రవి అన్నలాంటి వాడని చెబుతోంది రంభ.




ఒక్కసారి తన పక్కసీటులోని ముసలావిడ వైపు చూసి తల విదిలించి తన కర్తవ్యం గుర్తుకు వచ్చి ముందుకు కదిలాడు సీతారామారావు.

తన కొడుకు కార్తీక్‌ను గుర్తుకుతెచ్చిన ఆ పసివాడికి ముందుగా ప్రథమ చికిత్స మొదలుపెట్టాడు. తరువాత కాలు ఫ్రాక్చర్ అయిన పెద్దాయనకు ఇంజెక్షన్ ఇచ్చాడు. ముందు కూర్చున్న అమ్మాయి క్రిందకు పడిపోయి కద లలేక ఏడుస్తోంది.

ఆ అమ్మాయిని పువ్వులా పదిలంగా లేవదీసి కూర్చోబెట్టాడు. ఆమె భుజం దగ్గర కీలు తొలగినట్టుంది. నొప్పితో విలవిల్లాడిపోతోంది. ఆమె చేయి సరైన పొజిషన్‌లో పెట్టి కదలకుండా మెడకు, చేతికి స్లింగ్ వేసాడు. ఒక మాత్ర ఆమెతో మింగించాడు. ఇవన్నీ అవుతూ ఉండగానే పోలీసు వ్యాన్‌లు, అంబులెన్స్‌లు వచ్చాయి. అందర్నీ కిందకు దింపారు. సీతారా మారావు పక్కన కూర్చున్న ముసలావిడను ఆఖరుగా కిందకు తీసుకువ చ్చారు. ఆమె తలను జాగ్రత్తగా పట్టుకుని దిగాడాయన.

అంబులెన్స్ నుండి దిగిన డాక్టర్లు ఇద్దరు సీతారామారావును చూడగానే నమస్కారం చేసారు. ఒకరిద్దరకు తప్ప ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదు. చిన్న దెబ్బలు తగిలిన వాళ్లకు ఆ డాక్టర్లిద్దరూ కట్టు కట్టడం, మందులి వ్వడం చేసారు. ఫ్రాక్చర్ అయిన వాళ్లని అంబులెన్స్‌లో ఎక్కించారు.

అటుగా వస్తున్న ఇంకో బస్‌ను ఆపి మిగిలిన ప్రయాణికులను నెమ్మ దిగా అందులోకి ఎక్కిస్తున్నారు కండక్టరు, డ్రైవరు.

ముసలావిడను పడుకోబెట్టిన దగ్గర మౌనంగా నిలబడి ఉన్నాడు సీతా రామారావు. పోలీసులు అందర్నీ పరీక్షించి ఆయన దగ్గరకు వచ్చారు. అంతలో ఇద్దరు డాక్టర్లు అక్కడికి చేరుకున్నారు.

"మీరు సమయానికి సరైన చికిత్స అందించబట్టి ఆ పసివాడు, కాలు ఫ్రాక్చరైన ముసలాయన, భుజం కీలు తొలగిన అమ్మాయి రక్షింపబడ్డారు. దురదృష్టంకొద్దీ ఈ ముసలావిడకు మాత్రం క్షణాల్లో ప్రాణం పోయింది. ఇంతకూ ఈమె ఎవరి తాలూకు మనిషో?'' అంటూ చుట్టూ చూసారు ఆ ఇద్దరు డాక్టర్లు..

"ఆవిడ మా అమ్మగారు'' గట్టిగా అరిచాడు సీతారామారావు. క్రింద మట్టిలో కూలబడి మోచేతుల్లో ముఖం దాచుకున్నాడాయన.

అంబులెన్స్‌లోకి ఎక్కుతున్న క్షతగాత్రులు, బస్‌లోకి ఎక్కబోతున్న ఇతర ప్రయాణికులు, కండక్టర్, డ్రైవర్, డాక్టర్లు, పోలీసులు... అందరూ ఒక్క క్షణం పాటు అచేతనులయ్యారు.

పక్కన కూర్చున్న తల్లి యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోతే ఆ షాక్‌ని, దుఃఖాన్ని పక్కకుపెట్టి డాక్టర్‌గా తన కర్తవ్యం గుర్తించి గాయపడిన తోటి ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స చేసి సహాయపడిన ఆయన వైపు చేష్టలు దక్కి చూస్తుండిపోయారు.

బెంగుళూరులో మూడురోజులు జరిగిన మెడికల్ కాన్ఫరెన్స్‌కు హాజరై, కొడుకు కార్తీక్ కోరిక ప్రకారం అనంతపురంలో వున్న తన తల్లిని బయల్దేర తీసి పుట్టినరోజు వేడుకలలో పాల్గొనాలని వస్తున్న ప్రసిద్ధ సర్జన్ డా.సీతారా మారావు తల్లి శవం పక్కన స్తబ్దంగా కూర్చున్నాడు.

పోలీసులు తలమీది టోపీలు తీసి గౌరవం చూపారు. డాక్టర్లిద్దరూ ఆయన పక్కన నిలబడ్డారు. ఆయనతోపాటు బస్‌లో ప్రయాణించి, అతని సేవలు పొందిన వారందరూ ఇటువంటి మనిషిని మళ్లీ చూడగలమా అన్నట్లు వినయంగా, గౌరవంగా ఆయనకు నమస్కరించి కళ్లు తుడుచుకు న్నారు. ఒక్కసారిగా వీచిన గాలికి ఆవిడ మీద కప్పిన శాలువ పక్కకు తొల గితే పదిలంగా తల్లికి కప్పాడు డాక్టర్ సీతారామారావు.

☆